క్లుప్తంగా

కష్టపడితేనే ఉత్తమ భవిత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కష్టపడి చదివితేనే ఉత్తమ భవితను సొంతం చేసుకుంటారని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటీ జోనల్ హెడ్ సీతారామారావు అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ ఆంథోని బాలికల పాఠశాల (ఆర్‌సీఎం స్కూల్)లో విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సీతారామారావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. పెద్దలు చెప్పే నీతిని, మంచిని పిల్లలందరూ అలవర్చుకొని చదువులో బాగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజినల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ సోనీ ప్రశాంత్, విజయవాడ మెయిన్ బ్రాంచి హెడ్ సౌజన్య, కరస్పాండెంట్ మేరీరాణి, ప్రిన్సిపాల్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఆటోడ్రైవర్‌కు గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డులో రోడ్డు దాటుతున్న ఆటో డ్రైవర్‌ను వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్ రాజారావు గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... భానూనగర్‌కు చెందిన పెదపూడి రాజారావు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈయన శనివారం ఉదయం టిఫిన్ కోసం బీఆర్టీఎస్ రోడ్డులో రోడ్డు దాటుతున్నారు. ఈక్రమంలో వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం రాజారావును ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన రాజారావును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుడమేరును ప్రక్షాళన చేయండి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వం తక్షణమే బుడమేరు ప్రక్షాళన చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ కోరారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా విజయవాడ నగర ప్రజలు, బుడమేరు పరివాహ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన గురవుతున్నారన్నారు. శనివారం ఆయన విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం బుడమేరు ప్రక్షాళన చేపడతామని చెప్పిందని, తీరా ఇపుడు బుడమేరుకు వరదలు రావు ఆందోళన చెందొద్దని చెబుతోందన్నారు. తక్షణమే బుడమేరును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. గత సెప్టెంబర్‌లో విజయవాడ నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని , భవిష్యత్‌లో అటువంటివి జరగకుండా చూడాలన్నారు.

ఆక్రమణల నుంచి అందుబాటులోకి!

- తుది మెరుగులు దిద్దుకుంటున్న ఏఎస్ఆర్ పార్కు
- రూ. 70 లక్షల మంజూరుతో పనులు వేగవంతం



పచ్చదనం సంతరించుకున్న పార్కు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం, బీఎస్ రాజురోడ్డు, ఇరిగేషన్ స్థలంలో గతంలో ఆక్రమణలకు గురైన ఏఎస్ఆర్ (అల్లూరి సీతారామారాజు) పార్కు ప్రజల విజ్ఞప్తులు, స్థానిక కార్పొరేటర్ కృషి ఫలితంగా ప్రజలకు అందుబాటులోకి రానుంది. గత 35 ఏళ్ల క్రితం నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు పార్కు ఒకప్పుడు పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం, పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు, పెద్దలు సేద తీరేందుకు మౌలిక సదుపాయాలు, వాకింగ్ ట్రాక్‌తో నిత్యం కళకళలాడుతుండేది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వృద్ధులు, మహిళలు పిల్లలతో ఈ పార్కుకు వచ్చి సేద తీరేవారు. ప్రస్తుతం వాటి నిర్వహణ బాధ్యతలను చూసుకోవాల్సిన నగర పాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం ఫలితంగా కోట్ల విలువ చేసే ఈ పార్కును ఒక స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఆక్రమించుకుని తమ అవసరాలకు వాడుకుంటున్నారు.

ఆక్రమణల నుంచి ప్రజలకు అందుబాటులోకి....

గతంలో పార్కును ఆక్రమించుకునే పనిలో అందులో ఏర్పాటు చేసిన పిల్లల ఆటపరికరాలను సైతం తమ అవసరాలకు అడ్డుగా ఉన్నాయనే కారణంగా వాటిని పూర్తిగా తొలగించి పార్కులో ఒక మూలన పడేశారు. పార్కుకు ఉన్న రెండు గేట్లకు తాళాలు వేసుకుని ఆక్రమణదారులు తమ సొంత అవసరాలకు, వారి కార్లను పార్కింగ్ చేసుకోవడానికి వాడుకునేవారు. దీనిపై ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలపై స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి పార్కు పునప్రారంభం కోసం విశేషంగా కృషి చేశారు. నగర పాలక సంస్థ కౌన్సిల్‌లో పార్కు పునరాభివృద్ధికి ప్రతిపాధనలు పెట్టడంతో నగర పాలక సంస్థ 15వ ఆర్థిక సంఘం నుంచి రూ. 70 లక్షలు నిధులు మంజూరు చేయడంతో అధికారులు పార్కును స్వాధీనం చేసుకుని పనులు ప్రారంభించారు.



పార్కులో ఏర్పాటు చేసిన విశాలవంతమైన వాకింగ్ ట్రాక్

ప్రారంభమైన పార్కు అభివృద్ధి పనులు....

ఎంతో కాలంగా స్థానికులు ఎదురు చూస్తున్న అల్లూరి సీతారామరాజు పార్కులో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని రకాల మౌలిక సదుపాయాలతో సందర్శకుల ఆకాంక్షలకు అనుగుణంగా పార్కు అభివృద్ధి పనులకు అధికారులు చర్యలు చేపట్టారు. సందర్శకులు, పిల్లలతో ఆహ్లాదకంగా ఉండేలా పచ్చదనం, కూర్చునేందువకు సిమెంట్ బల్లలు, తాగు నీరు, టాయిలెట్‌లు, పిల్లలు ఆడుకునేందుకు ఆటపరికరాలు, ఓపెన్ జిమ్‌తో పాటు బయట వ్యక్తులు లోపలికి రాకుండా పటిష్టమైన ప్రహరీ నిర్మాణంతో పార్కుకు సరికొత్త హంగులు తీసుకొస్తున్నారు.



ఓపెన్ జిమ్‌లో ఏర్పాటు చేస్తున్న జిమ్ పరికరాలు

విలువలతో కూడిన విద్య అవసరం

విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ కోన శశిధర్



వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంబిస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్

లబ్బీపేట(విజయవాడతూర్పు):విద్యార్థి దశలో కొన్నిటిని త్యాగం చేసి చదువుకే పూర్తి సమయాన్ని కేటాయిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరడం సాధ్యమవుతుందని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ సూచించారు. సోషల్ మీడియా, సెల్ ఫోన్లు వంటి వాటికి కొంతమేర దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించిన వారు అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతారని చెప్పారు. విజయవాడలోని శారద విద్యాసంస్థల ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ శనివారం ఏ ప్లస్ కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోన శశిధర్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య మనందరి లక్ష్యం కావాలని తెలిపారు. ఆ మాట కాలేజీ బ్యానర్ పై చూడగానే తనకు ఎంతో ఆనందం కలిగిందని చెప్పారు. నేటి సమాజంలో పిల్లలకు కావాల్సిన సత్ప్రవర్తన, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, స్నేహం, గౌరవ మర్యాదలు, సహాయ సహకారాలు, సేవా దృక్పథం, లక్ష్యసాధన, సమాజంలో వారు ఎటువంటి స్థానంలో ఉండాలి అనే అంశాలపై అవగాహన కలిగించాలని సూచించారు. సమాజం, కుటుంబం పట్ల కలిగి ఉండే బాధ్యతలను, మానవతా విలువలను నేర్పించే కేంద్రాలు కేవలం విద్యాసంస్థలే అని వివరించారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీని మంచి చెడులను దృష్టిలో పెట్టుకొని వినియోగించుకోవాలని తెలిపారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు దుర్వినియోగం చేసుకోకూడదని చెప్పారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల ఛైర్మన్ వై.రమేష్ బాబు అధ్యక్షత వహించగా, గౌరవ అతిథిగా డాక్టర్ వెల్లంకి శేషగిరిరావు ప్రసంగించారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి, కళాశాల అడ్వైజర్ ఈఎస్ ఆర్ కె ప్రసాద్ తదితరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

తుది దశకు చేరిన రోడ్డు పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ గుణదల రోడ్డు పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇక్కడ రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండటంతో పాటు కనీసం రోలింగ్ చేయకపోవటంతో స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి పలుమార్లు కథనాలు ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు రోడ్డు పనులు వేగవంతం చేశారు. ఎట్టకేలకు రోడ్డు పనులు తుది దశకు చేరుకోవటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



దావు బుచ్చయ్యకాలనీ గుణదల రోడ్డు పనులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్) సూర్యారావుపేట సెక్షన్ లో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ డోర్నకల్ రోడ్ ఫీడర్ పరిధిలో గోపాలరెడ్డి రోడ్, సాయిరామ్ హోటల్ ఏరియా, నక్కలరోడ్డు ఆంధ్రా హాస్పిటల్ ఏరియా, స్టేట్ గెస్ట్ హౌస్, డిజిపి గారి క్యాంపు ఆఫీస్, సిఎస్ఐ (చర్చి) ఏరియా, కోర్ట్ బిల్డింగ్స్ ఏరియా, ప్రకాశం రోడ్డు, కాశేశ్వరరావు రోడ్ కొంతభాగం, మాదిరెడ్డి వారి వీధి, భవానీ వీధి, విష్ణువర్ధనరావు వీధి కొంతభాగం. 11 కేవీ విశాలాంధ్ర ఫీడర్ పరిధిలో విశాలాంధ్ర రోడ్, బ్రహ్మానందరెడ్డి అన్ని లైన్‌లు, ఇజ్జాడవారివీధి, నేతాజీ వీధి, శ్రీనివాసరావు వీధి, బారిస్టర్ వారి వీధి, బంకపల్లి వారి వీధి, పాపయ్య వీధి, బాలాజీ వీధి, అంజనీ హోటల్ ఏరియా, గుడ్ మార్నింగ్ హోటల్ ఏరియా, చలసాని వెంకట కృష్ణయ్య వీధి, కోవెలమూడి వారి వీధి, దాసరి వారి వీధి మ్యూజియం రోడ్డు ఫీడర్ పరిధిలో గవర్నర్‌పేట మ్యూజియం రోడ్డు ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 7:గంటల నుండి 11 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. మ్యూజియం రోడ్డు , సివిల్ కోర్టులు ఏరియా, గోపాలరెడ్డి రోడ్డు , కస్పా వారి వీధి , జేడీ హాస్పిటల్ రోడ్డు, కాంగ్రెస్ ఆఫీసు రోడ్డు, ప్రకాశం రోడ్డు దుర్గయ్య వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావున ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.



స్వాతంత్య్ర దినోత్సవ పరేడ్‌లో రెండో స్థానం పొందిన ఎన్‌సీసీ కేడెట్స్

ఎన్‌సీసీ కేడెట్‌ల ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 79వ స్వాతంత్ర్య వేడుకల పరేడ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ 17(ఎ) బెటాలియన్ కేడెట్‌లు సత్తా చాటారు. ఆ పరేడ్‌లో చూపిన ప్రతిభతో రెండో స్థానంలో నిలిచి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదగా బహుమతి అందుకున్నట్లు ఆ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే తెలిపారు. పది రోజుల పాటు కఠినమైన డ్రిల్‌తోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా సత్తా చాటిన కేడెట్‌లకు, పర్యవేక్షించిన సుబేదార్ భోపాల్‌రెడ్డి, నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కె.సుధాకర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

ఆలయాల్లో శ్రీకృష్ణుడికి పూజలు



శ్రీ కృష్ణుడుకి పూజలు చేస్తున్న గౌతంరెడ్డి



మాచవరంలో పూజలు చేస్తున్న దృశ్యం



శ్రీకృష్ణుని విగ్రహం వద్ద పూజ చేస్తున్న నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



మధురానగర్ శ్రీ కృష్ణ మందిరంలో పూజలందుకున్న స్వామి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధురానగర్ వీవీనరసరాజు వీధిలోని శ్రీ కృష్ణమందిరం, శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం, ముత్యాలంపాడు కోదండ రామాలయం, సత్యనారాయణపురం శివకేశవ దేవాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధురానగర్ శ్రీ కృష్ణమందిరంలో స్వామివారిని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు ప్రహ్లాదరావు, మసిముక్కు శ్రీనివాసయాదవ్, ఆంజనేయులు, లీలాప్రసాద్, సాంబశివరావు, సింగం వెంకన్న, బర్మాశ్రీనివాస్, రాంబాబు, రాబిల్లి రాజు తదితరులు పర్యవేక్షించారు. 28వ డివిజన్ సత్యనారాయణపురం రాజేశ్వరి వీధిలోని స్టార్ ఫిజియోథెరపీ సెంటర్‌లో శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని చిన్నారుల వేషధారణ పోటీలు జరిగాయి. చిన్నారులు శ్రీ కృష్ణుడు, రాధాదేవి, రుక్మిణి, గోపికల అంకారంలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్టు డాక్టర్ ఎం ప్రభుదాస్ శ్రీకృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.పూర్ణిమ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

లోకానికి జ్ఞానం పంచిన గీతాచార్యుడు శ్రీ కృష్ణుడు

మధురానగర్(విజయవాడసెంట్రల్): లోకానికి జ్ఞానం పంచిన గీతాచార్యుడు శ్రీ కృష్ణుడు అని ఆయన ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని షిరిడీ సాయిబాబా మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ఆకాంక్షించారు. ముత్యాలంపాడు సాయిబాబా మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీ కృష్ణుడుని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కృష్ణుడు జన్మదినోత్సవం సర్వ మానవాళికి పర్వదినమని అన్నారు. శ్రీకృష్ణుడి జీవితం ఒక ధర్మశాస్త్రం అన్నారు. సమస్త మానవాళిని సన్మార్గంలో నడిపే విధంగా ఆ పరమాత్ముడు అర్జునునికి గీతను బోధించాడని పేర్కొన్నారు. కృష్ణతత్వం చదివిన వారికి నిజమైన ప్రేమతత్వం తెలుస్తుందని చెప్పారు. గీతాసారాన్ని మనసున నింపుకోగలిగితే జీవితం సంతోషమయం అవుతుందని తెలిపారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

మాచవరంలో..........

మాచవరం పోతిన వారివీధిలోని శ్రీ కృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు కనులపండువగా జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, సతీష్ ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నాయకులు తోట పాండు తదితరులు పాల్గొన్నారు.

విలేజీకంద్రికలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కుందావారి కంద్రిక యాదవుల బజారులో యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కె.పార్థసారథి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత గ్రామస్తులు గోపూజ చేశారు. అనంతరం శ్రీకృష్ణునికి పంచామృతాలతో అభిషేక, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. గుడి కమిటీ సభ్యులు శేషగిరి, కొండలు, వెంకయ్య, జమలయ్య, హనుమంతరావు, ఏడుకొండలు, ఆర్ల బుల్లయ్య,కె.రవికుమార్, సాదం శ్రీనాధ్, పొన్నం శేషగిరి, పంగిడయ్య, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ శ్రీరాములు విలేజి కంద్రికలో శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

భగవద్గీత ప్రపంచానికి మార్గదర్శనం

పాయకాపురం(విజయవాడరూరల్): కర్మ సిద్ధాంతాన్ని తెలియచేసేది భగవద్గీత అని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం ఏపీఎస్‌రెడ్డి రోడ్డు నాగవంశ సంక్షేమ సంఘం మినీ కల్యాణ మండపంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో నగర మేయర్ పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భగవద్గీత ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. ప్రపంచానికి మార్గదర్శనం భగవద్గీత అన్నారు. ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణ జన్మాష్టమి వేడుకలు గత 5 సంవత్సరాలుగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తొలుత ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపి నాగవంశ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణ, టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకృష్ణుని దర్శించుకొని పూజలు చేశారు. ప్రబోధ సేవా సమితి అధ్యక్షులు, సభ్యులు కాళ్ల సత్యం, తిరుపతి, సురేష్, అప్పల నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో స్వామివారు



శ్రీకృష్ణ మందిరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



విలేజి కంద్రికలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి కె.పార్థసారథి, ఎమ్మెల్యే బొండా ఉమా

కనులపండువగా
కృష్ణాష్టమి వేడుకలు







శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు విజయవాడ నగరంలో శనివారం కనులపండువగా నిర్వహించారు. ఆలయాల్లో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు, యువతీ యువకులు ఎంతో ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురు చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణతో ఆకట్టుకున్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



మలబార్‌లో రత్నాభరణాల ప్రదర్శన



మలబార్‌లో రత్నాభరణాల సేకరణ వ్యాన ఆవిష్కరిస్తున్న కస్టమర్లు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ప్రతి మహిళ వేడుక చేసుకునే వేళ మహాత్మగాంధీ రోడ్డులోని మలబార్ షోరూంలో అద్భుత రత్నాభరణాల సేకరణ వ్యాన ప్రదర్శన ప్రారంభమయింది. షోరూంలో శనివారం తమ కస్టమర్లతో ఈ ఆభరణాలను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం హెడ్ అర్జున్ మాట్లాడుతూ ప్రతి మహిళ తన ప్రత్యేకతను చాటుకుంటూ వేడుక చేసుకునే అద్భుతమైన సరికొత్త రత్నాభరణాల సేకరణ వ్యానను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఏ రెండు రత్నాలు ఏ ఇద్దరి మహిళలు ఒకేలా ఉండరనే నమ్మకం నుంచి ప్రేరణ పొందిన వ్యాన మహిళల వ్యక్తిత్వం అంతర్గత బలం, స్వీయ వ్యక్తీకరణకు ఒక ప్రశంసగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కస్టమర్లు కె.కల్యాణ్మ, ఎస్‌డీ సన, టి. సునైన, ఎన్ ప్రియ, ఎస్‌కె రాజీ పాల్గొన్నారు.